

ఇందిరానగర్‌లో ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్



హిమాయత్‌నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దానం నాగేందర్, కార్పొరేటర్ మహాలక్ష్మి, రామన్‌గౌడ్ తదితరులు

కేంద్రంలో ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వమే

● సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఈసారి ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో గురువారం ఆయన పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అమలు చేస్తున్న, చేయబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నుంచి గతంలో గెలిచిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేసే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మెజారిటీ హామీలను నాలుగు నెలల్లోనే నెరవేర్చారని వివరించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రంలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగారావు, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల కార్యాలయం ప్రారంభం

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్ నగర్ డివిజన్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయాన్ని సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్, కార్పొరేటర్ మహాలక్ష్మి, రామన్‌గౌడ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు.

అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

యూసు‌ఫ్‌గూడ: కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభివృద్ధికి పాటు పడుతుందని సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బుధవారం రాత్రి రహ్మత్‌నగర్ శ్రీరామ్‌నగర్ చౌరస్తాలో రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత, టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, జూబ్లీహిల్స్ నాయకులు వి.నవీన్‌యాదవ్, కె.ఉపేందర్‌రెడ్డి, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి

రాంనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకర్గం నుంచి ఎంపీగా తనను గెలిపిస్తే పద్మశాలీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు అతినగరం సుదేష్, పద్మశాలి సంఘం నాయకులు, బీఆర్ఎస్ నేతలు దానం నాగేందర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో 30 వేల పై చిలుకు పద్మశాలి ఓటర్లు ఉన్నారని, వారందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో పద్మశాలీ సంఘం, బీఆర్ఎస్ నాయకులు కందగట్ల వెంకటేష్, కోడి వెంకటేష్, చిప్ప జగదీష్, సిలివేరు నారాయణమూర్తి, ఎ.సాయిరాం, అన్నల్‌దేశ్ రాజేష్, జె.బాలరాంరాజ్ తదితరులు ఉన్నారు.

వడ్డెర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

చిక్కడపల్లి: వడ్డెర కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గురువారం ఆయన సమక్షంలో వడ్డెర సంఘం నేతలు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి దానం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్టు చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ అంతయ్య తదితరులు పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్ శ్రీరామ్‌నగర్ చౌరస్తాలో రోడ్ షో నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్, అజారుద్దీన్



దానం, అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పద్మశాలి సంఘం అధ్యక్షుడు సుధేష్ తదితరులు

ఎంపీగా గెలిపించండి.. అందుబాటులో ఉంటా



అడిక్‌మెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావు, ముఠాగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎన్ శ్రీనివాస్

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎంపీగా గెలిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ తెలిపారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

పద్మారావుకు మద్దతుగా ప్రచారం

సనత్‌నగర్/అమీర్‌పేట/ఖైరతాబాద్: పద్మారావుగౌడ్‌కు మద్దతుగా సనత్‌నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి డివిజన్‌లోని రాజా రాజేశ్వరినగర్‌లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్, గాంధీనగర్‌లో బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

7న ఖైరతాబాద్‌లో కేటీఆర్ రోడ్డు షో

బంజారాహిల్స్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 7న హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, బంజారాహిల్స్ రోడ్డు నం.10 జహీరానగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 3న బంజారాహిల్స్, వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ బూత్ స్థాయి సమావేశం తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, నాయకులు మన్నెగోవర్ధన్‌రెడ్డి, విప్లవ్‌కుమార్, బోడ రాంచందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి మాల సామాజికవర్గం మద్దతు

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



అభివాదం చేస్తున్న మాల ప్రజా సంఘాల జేఏసీ నాయకులు

పంజాగుట్ట, మే 2(ఆంధ్రజ్యోతి): మాల సామాజికవర్గం ద్రోహులైన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిస్తామని మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నె శ్రీధర్ రావుతో కలిసి ఆయన మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి సాధికారత కోసం గతంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేసిందని, ప్రస్తుతం రాష్ట్రంతో పాటు దేశంలో ఆ పార్టీ అధికారంలో ఉంటే దళిత, బలహీన వర్గాలకు మరింత మేలు జరిగే అవకాశం ఉన్నదని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఆయన ప్రకటించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ వారికి దేశ సంపదను దోచిపెడుతుందని, దేశంలో ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేసి ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉందని అన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్‌వాదులను అణిచివేయడానికి తెలంగాణలోని కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నికతో సహా మూడు పార్లమెంటు ఎస్సీ రిజర్వ్ స్థానాలలో ఒక్కటి కూడా మాల సామాజిక వర్గానికి కేటాయించలేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో దళితులను కేసీఆర్ వంచించారని, ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని, సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. దళిత బహుజనులు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు గ్రేటర్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, నాయకులు కనకం ఎల్లస్వామి, చేపూరి శంకర్,కమల్ కుమార్, ఒగ్గు అనిల్ కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శశిభూషణ్‌రావుకు ధన్వంతరి నేషనల్ అవార్డు

పంజాగుట్ట, మే 2(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శశిభూషణ్‌రావుకు ధన్వంతరి నేషనల్ అవార్డు వరించింది. కళా నిలయం కల్చర్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తెలుగు సారస్వత పరిషత్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ ఎస్పీ భారతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, మరింత మందికి సేవ చేస్తానని శశిభూషణ్‌రావు తెలిపారు.



ధన్వంతరి నేషనల్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ శశిభూషణ్ రావు

బీసీల వ్యతిరేకి కిషన్‌రెడ్డిని ఓడిస్తాం

బీసీ కుల, ప్రజా సంఘాల నాయకులు



అభివాదం చేస్తున్న బీసీ కుల, ప్రజా సంఘాల నాయకులు

పంజాగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఉభయ సభల సమావేశాల్లో కులగణన చేయమని, చేసే ప్రసక్తే లేదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించి బీసీల వ్యతిరేకిగా మారారని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ వ్యతిరేకి అయిన ఆయనను ఓడిస్తామని వివిధ బీసీ కుల, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. తమ పూర్తి మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని సికింద్రాబాద్ నుంచి పోటీ చేస్తున్న దానం నాగేందర్‌తో పాటు మిగతా అభ్యర్థులను గెలిపిస్తామని వారు అన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ బీసీ కుల, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పాల్గొని మాట్లాడారు. మల్కాజిగిరిలో ఈటల రాజేందర్, భువనగిరిలో బూర నర్సయ్యగౌడ్, కరీంనగర్‌లో బండి సంజయ్, నిజామాబాద్‌లో ధర్మపురి అరవింద్‌ను, మెదక్‌లో రఘునందన్‌రావును ఓడించేందుకు కిషన్ రెడ్డి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. బీసీల నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని గుంజుకున్నాడని అన్నారు. ఈ ఎన్నికల్లో కిషన్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని బీసీలకు వారు పిలుపునిచ్చారు. బీసీలపై బీజేపీ కక్ష గట్టిందని ఆరోపించారు. బీసీ కులగణన సాధన కోసం రాహుల్ గాంధీ దేశమంతా పర్యటిస్తున్నారని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన తొందరగా జరుగుతుందని వారు అన్నారు. ఈ సమావేశంలో బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య, బీసీ న్యాయవాదుల ఫోరం అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జై గౌడ జాతీయ ఉద్యమం అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మాలి సత్యంగౌడ్, టీపీసీసీ గీతా సెల్ ఉపాధ్యక్షురాలు రేవతి గౌడ్, బీసీ మహిళా జేఏసీ చైర్ పర్సన్ జయంతిగౌడ్, ఆల్ ఇండియా యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బెక్కం వెంకట్,తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు మురళీకృష్ణ, ఓయూ జేఏసీ అధ్యక్షులు నగిరి ప్రవీణ్, బిక్షపతి, ఎర్ర శ్రీహరి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా 6న ఏకలవ్య ఆత్మగౌరవ సమ్మేళన సభ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కుతాడి కుమార్, నాయకులు

పంజాగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఈనెల 6న యాప్రాల్ బాపూజీనగర్ చౌరస్తాలో ఏకలవ్య ఆత్మగౌరవ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలోఏకలవ్య ఆత్మగౌరవ సమ్మేళన సభ పోస్టర్‌ను ఆయన సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, వారి గెలుపుకోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఏకలవ్య ఆత్మగౌరవ సమ్మేళన సభకు పెద్దఎత్తున తమ సామాజికవర్గం ప్రజలు, మేధావులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఎస్.శేఖర్, కోశాధికారి బి.రఘు, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్యామల, పి.లింగయ్య, శ్రీహరి, ఎస్.కృష్ణ, ఎం.లింగయ్య, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.




ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

సకాలంలో జీతాలు చెల్లించాలి

● ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

ఎర్రగడ్డ, మే 2 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం నిరసనకు దిగారు. ఆస్పత్రి సీఐటీయూ యూనియన్ సభ్యులు ఎస్.లింగయ్య మాట్లాడుతూ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, పేషంట్ కేర్ కాంట్రాక్టు ఉద్యోగులకు ఆల్ సర్వీసెస్ గ్లోబల్ సంస్థ మూడు సంవత్సరాలుగా కాంట్రాక్టు నిర్వహిస్తుందని తెలిపారు. ఒక్క నెల కూడా సకాలంలో జీతాలు చెల్లించింది లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గత మూడు నెలలుగా ఉద్యోగులకు జీతాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన వాపోయారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టును రద్దుచేసి కొత్తగా టెండర్‌కు వెళ్లి కార్మికులకు న్యాయం చేయాల్సిందిగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కోరామని కార్మికులు తెలిపారు. రెండు రోజుల్లో జీతాలు ఇవ్వని పక్షంలో కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ మానసిక ఆస్పత్రి శాఖ ఉపాధ్యక్షుడు బి.శ్రీధర్, సభ్యులు పి.లక్ష్మి, భాగ్య, నయీమ్ అలీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

'హరేకృష్ణ మూవ్‌మెంట్'కు డీజిల్ జనరేటర్ అందజేత



హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్‌కు డీజిల్ జనరేటర్‌ను అందజేసిన బీఎస్‌సీపీఎల్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు రూ.54 లక్షల విలువైన 625 కేవీఏ జనరేటర్‌ను బీఎస్‌సీపీఎల్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య అందజేశారు. అన్నపూర్ణ, భోజనామృత, సద్దిమూట వంటి పథకాలతో నిరుపేదల ఆకలి తీర్చే కార్యక్రమాలు సమర్థవంతగా అమలు చేసేందుకు వంటగది సామర్థ్యాలు పెంచేందుకు ఫౌండేషన్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ సందర్భంగా బీఎస్‌సీపీఎల్ కంపెనీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ మానవాళికి చేసే సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్యగౌరచంద్ర దాస ప్రభుజీ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సమాజంలో సానుకూల మార్పును పెంపొందించడంలో బీఎస్‌సీపీఎల్ నిబద్ధతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సెక్రటరీ రాఘవ, హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ప్రముఖులు పాల్గొన్నారు.

మేనకోడలిని ఫోన్‌లో వేధిస్తున్న వ్యక్తికి జైలు

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): మేనకోడలిని ఫోన్‌లో వేధిస్తున్న వ్యక్తికి కోర్టు ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించింది. నగరానికి చెందిన శ్రీను ప్రైవేటు ఉద్యోగి. తన మేనకోడలు భర్తతో గొడవపడి ఒంటరిగా ఉంటుంది. తరచూ ఆమెకు ఫోన్ చేసి శ్రీను వేధిస్తున్నాడు. ఆమె ఫోన్ నంబర్‌ను తెలిసిన వారికి కూడా ఇచ్చాడు. బాధితురాలి ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి ఈ-పెట్టీ కేసు పెట్టి 10వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. నిందితుడికి 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి మందా మురళీ తీర్పు వెలువరించారు.

హోటల్ వ్యాపారికి నాలుగు రోజులు..

అర్ధరాత్రి తరువాత హోటల్ తెరిచి ఉంచి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న యజమానికి కోర్టు నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది. ఇందిరానగర్‌లో షబ్బీర్ ఖాజీమ్ రజ్వీ స్పైసీ పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. నిబంధనలను ఉల్లంఘిస్తూ అర్ధరాత్రి తరువాత కూడా హోటల్ తెరిచి ఉంచుతున్నాడు. పోలీసులు హెచ్చరించినా తీరు మార్చుకోలేదు. దీంతో పోలీసులు ఖాజీమ్ రజ్వీపై 70(సి) కింద ఈ-పెట్టీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి నాలుగు రోజుల జైలు విధిస్తూ న్యాయాధికారి మందామురళీ తీర్పు వెలువరించారు.

గృహిణి ఆత్మహత్య

బంజారాహిల్స్, మే 2(ఆంధ్రజ్యోతి): గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫిలింనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కేరళకు చెందిన యాసిర్‌సిద్దిఖీ, తస్‌ఫియా అలవి(23) భార్యాభర్తలు కొద్ది రోజుల క్రితం నగరానికి వచ్చి టోలిచౌకి సమతాకాలనీలోని ఓ భవనంలోని పెంట్‌హౌస్‌లో ఉంటున్నారు. ఈ నెల 1న యాసిర్‌సిద్దిఖీ పనిమీద బయటకు వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపు పెట్టి ఉంది. ఎంత కొట్టినా ఎవరూ తెరవలేదు. కిటికీని తెరిచిచూడగా బెడ్‌రూంలో తస్‌ఫియా అలవి తాడుతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించింది. తలుపు పగులకొట్టి చూడగా అప్పటికే తస్‌ఫియా మృతిచెందింది. ఫిలింనగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ సొమ్ము వాడుకున్న ఉద్యోగిపై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్, మే 2(ఆంధ్రజ్యోతి): హోటల్ బిల్లులను సొంత బ్యాంకు ఖాతాలోకి మళ్లించుకొని యజమానిని మోసం చేసిన ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నం.63లో హోటల్ ట్రీఇన్నత్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా వల్లభనేని కృష్ణ మోహన్‌బాబు వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం 2023-2024 ఆడిట్ నిర్వహించగా అందులో రూ.6 లక్షలు లెక్కకు రాలేదు. రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న దండు సుధాకర్ వినియోగదారుల నుంచి వచ్చిన డబ్బును తన బ్యాంకు ఖాతాలోకి మళ్లించి సొంత అవసరాలకు వాడుకున్నట్టు గుర్తించారు. ఇదే విషయాన్ని సుధాకర్‌ను నిలదీయగా డబ్బు వాడుకున్నది నిజమేనని ఒప్పుకున్నాడు. తిరిగి ఇచ్చేస్తానని చెప్పడంలో ఉద్యోగంలో అలాగే కొనసాగించారు. కానీ, ఇటీవల మరో వినియోగదారుడికి బాంకెట్‌హాల్‌తో పాటు 20 గదలు అద్దెకు ఇస్తానని చెప్పి తన ఖాతాలో మూడు లక్షల రూపాయలు జమ చేయించుకున్నాడు. దీంతో హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దృష్టి మరల్చి సెల్ ఫోన్‌తో ఉడాయించిన వ్యక్తి అరెస్ట్

ఖైరతాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): దృష్టి మరల్చి సెల్ ఫోన్‌తో ఉడాయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఖైరతాబాద్ డీఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలబస్తీకి చెందిన రవికుమార్ ప్రైవేటు ఉద్యోగి. మార్చి 14న ఖైరతాబాద్ మెట్రో రైల్వేస్టేషన్ వద్ద తన కంపెనీ బస్సు దిగి రవికుమార్ ఇంటికి వెళ్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అర్జెంటుగా ఫోన్ మాట్లాడాలని రవికుమార్ సెల్‌ఫోన్ తీసుకున్నాడు. ఫోన్ మాట్లాడుతూ కనిపించకుండా పోయాడు. దీంతో బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోన్ ఈఐఎం నంబరు ద్వారా నిందితుడిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

కిషన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం



సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా బోరబండ సైట్-3లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీజేపీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి, కార్యక్రమంలో నేతలు కిలారి మనోహర్, కొట వెంకటేష్, కృష్ణమోహన్, పాల్, సతీష్, లక్ష్మణ్ తదితరులు - బోరబండ, మే 2 (ఆంధ్రజ్యోతి)



సనత్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు లింగంపల్లి నర్సింగరావు తదితరులు

సనత్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా సనత్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో బీజేపీ సీనియర్ నాయకుడు లింగంపల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని, సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు ఆకుల మహేష్, అశోక్ గౌడ్, ప్రకాష్ దూబె, సురేందర్ నాని తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల రద్దు ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న రాజేశ్వర్‌యాదవ్

బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లను రద్దు చేసే ప్రయత్నాన్ని బీజేపీ ఉపసంహరించుకోవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్న సందర్భంగా బీసీల కులగణన, ప్రత్యేక మంత్రిత్వశాఖ, బీసీ బిల్లుపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో బీసీలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని, బీసీ కులగణన చేయకుండా అణచివేసే ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలంతా ఒకేతాటిపై నిలిచి బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు భిక్షపతి, మల్లేష్, మహేందర్‌గౌడ్, సాయి, రాహుల్ పాల్గొన్నారు.

5న మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం

బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఈనెల 5న కాచిగూడ మున్నూరు కాపు భవన్‌లో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ తెలిపారు. గురువారం కాచిగూడలో మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మున్నూరు కాపులు దానం నాగేందర్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో లింగిశెట్టి హనుమంతరావు, కొండూరు వినోద్‌కుమార్, బి.ఆర్.జితేందర్, కట్టెల సుభాష్, ఆనంద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను ముందుతరాలకు అందించడం అభినందనీయం



జ్ఞాపికలు, సర్టిఫికెట్స్‌తో చిన్నారులు

చిక్కడపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను ముందుతరాలకు అందించడం అభినందనీయమని ప్రముఖ నృత్యకళాకారిణి సరళకుమారి అన్నారు. సాలభంజిక స్టూడియో ఫర్ ఆర్ట్స్ అండ్ పర్ఫార్మెన్స్ సంస్థ 6వ వార్షికోత్సవం గురువారం త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. సాలభంజిక సంస్థ ఎందరో కళాకారులను తీర్చిదిద్దిందన్నారు. ఒక సంస్థను ఓ మహిళ ఆరేళ్లపాటు నడపడం అంత సులువు కాదన్నారు. కేరళ రాష్ట్రంలోనే కాకుండా హైదరాబాద్‌లో కూడా సాలభంజిక సంస్థ శాఖలను స్థాపించి నడపడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా నాట్య గురువులు గంటా పద్మజ, లంకేశ్, కోన జానకి, మోహన్‌రావు, బద్దర్ రావు, డా. అరవ ఆంజనేయులు, అడ్డాల నాగేశ్వర రావు, డా. ఆంజనేయులును సన్మానించారు. ప్రముఖ నటి రాగిణి, గంధం బసవ శంకరరావు, పాలపర్తి సంధ్యారాణి, దైవజ్ఞశర్మ, సాలభంజిక వ్యవస్థాపకురాలు డా. పట్టాభి ధన్య మీనన్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. శివ పంచాక్షరి, దశావతారాలు, మండూక శబ్దం, అన్నమాచార్య కీర్తనలు, తరంగం, థిల్లానా నృత్యాలను చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారు. చిన్నారులకు అతిథులు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

కేంద్రంలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో గురువారం ఆయన పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అమలు చేస్తున్న, చేయబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నుంచి గతంలో గెలిచిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేసే సత్తా కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మెజారిటీ హామీలను నాలుగు నెలల్లోనే నెరవేర్చారని వివరించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రంలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగారావు, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి

రాంనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకర్గం నుంచి ఎంపీగా తనను గెలిపిస్తే పద్మశాలీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు అతినగరం సుధేష్, పద్మశాలి సంఘం నాయకులు, బీఆర్ఎస్ నేతలు దానం నాగేందర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి దానం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో 30 వేల పై చిలుకు పద్మశాలి ఓటర్లు ఉన్నారని, వారందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలీలకు అండగా ఉంటుందన్నారు. సుధేష్ మాట్లాడుతూ.. దానం నాగేందర్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో పద్మశాలీ సంఘం, బీఆర్ఎస్ నాయకులు కందగట్ల వెంకటేష్, కోడి వెంకటేష్, చిప్ప జగదీష్, సిలివేరు నారాయణమూర్తి, ఎ. సాయిరాం, అన్నల్‌దేశ్ రాజేష్, జె.బాలరాంరాజ్, కావాలి మధుకర్, ప్రవీణ్‌కుమార్, నగేష్, సన్ని ఉన్నారు.



జూబ్లీహిల్స్ ఇందిరానగర్‌లో ప్రచారంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

వడ్డెర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

చిక్కడపల్లి: వడ్డెర కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గురువారం ఆయన సమక్షంలో వడ్డెర సంఘం నేతలు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి దానం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్టు చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్ డా. ఓర్సు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో గెలుస్తాం

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్‌లో గెలుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. హిమాయత్‌నగర్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల క్యాంపు కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో ఏడేళ్ల పాటు నిర్బంధంలో గడిపినట్లుగా ఉండేదని, కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత స్వాతంత్ర్యం వచ్చినట్లుగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలందరూ సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. టీపీసీసీ నేతలు అంజన్‌కుమార్, నిరంజన్, రోహిణ్, రామన్‌గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, కార్పొరేటర్ మహాలక్ష్మి పాల్గొన్నారు.



దానం, అంజన్‌కుమార్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పద్మశాలి సంఘం అధ్యక్షుడు సుధేష్ తదితరులు

పలు ప్రాంతాల్లో నాయకుల ప్రచారం

ముషీరాబాద్/రాంనగర్/కవాడిగూడ/చిక్కడపల్లి: దానం నాగేందర్‌కు మద్దతుగా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ జాతీయ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో ముషీరాబాద్ డివిజన్‌లో గురువారం ప్రచారం నిర్వహించారు. బాగ్‌అంబర్‌పేటలో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్ ఆధ్వర్యంలో దోమలగూడలోని మునిసిపల్ క్వార్టర్స్, గగన్‌మహల్, జ్యోతినగర్, దేవి ప్రసాద్,కూచిపూడి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. రోహిత్ ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్‌లో గాడిద గుడ్డు ఏర్పాటు చేసి బీజేపీ పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కిషన్‌రెడ్డి అంబర్‌పేట అభివృద్ధికి కృషి చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపిస్తే సికింద్రాబాద్ అభివృద్ధి చెందుతుందన్నారు.

మామను గెలిపించాలని కోడలి ప్రచారం



గోవిందాపురంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సునీత



పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న కోడలు శిల్పా, కార్పొరేటర్ కంది శైలజ

సికింద్రాబాద్, బౌద్ధనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన మామ తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోడలు తీగుళ్ల శిల్పా ఎన్నికల ప్రచారం చేశారు. గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడ, ఎల్.నారాయణనగర్, అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ కంది శైలజతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లకు కరపత్రాలందజేసి ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జంకి రాజేష్, పాకసాయి, బి.సాయి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ నగర్‌లో: పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం సాయంత్రం సీతాఫల్‌మండి డివిజన్లో పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ సామల హేమ ఎన్నికల ప్రచారను నిర్వహించారు. వేంకటేశ్వరనగర్, మార్కండేయనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటువేయాలని కోరారు.

చిలకలగూడ: బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతు మెట్టుగూడ, కార్పొరేటర్ రాసూరి సునీత గురువారం విస్తృత ప్రచారం చేశారు. డివిజన్ పరిధిలోని గోవిందాపురం, ఆలుగడ్డ బావి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేసి తెలంగాణ గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే కారు గుర్తుకి ఓటు వేయాలని కోరారు.

గడప గడపకూ బీఆర్ఎస్ ప్రచారం

రాంగోపాల్‌పేట్, మే 2 (ఆంధ్రజ్యో): ఈ నెల 13న జరుగనున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని కంజోజీ బజార్, అషూర్ ఖానా గల్లీ, పాన్ బజార్, లాలాటెంపుల్ బస్తీలలో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఇంటింటికి తిరిగారు. ప్రచారంలో డివిజన్ ఉపాధ్యక్షులు నర్సింగం సతీష్, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

మారేడుపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆహారం లభించక ఎండల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తూ వడదెబ్బకు గురైన 55 సంవత్సరాల వయస్సు గల వద్ధురాలు మృతి చెందిన సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 3వ తేదీన వెస్ట్ మారేడుపల్లిలో భిక్షాటన చేస్తూ ఓ వద్ధురాలు సాయంత్రం కుప్పకూలి పడిపోయింది. సమాచారం అందుకున్న మారేడుపల్లి పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మే ఒకటో తేదీన రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆహారం సరిగా తీసుకోకపోవడం, ఎండ తీవ్రతకు తిరిగినందుకు వడదెబ్బ కారణంగా గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెంది ఉండవచ్చు అని పోలీసులు తెలిపారు.



రాగిడి లక్ష్మారెడ్డి విజయం ఖాయం

అల్వాల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయం ఖాయమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం వెంకటాపురం డివిజన్ సత్యసాయి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్ సమావేశానికి ఆయన స్థానిక కార్పొరేటర్ సబితాకిషోర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరూ అంకిత భావంతో పనిచేసి కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేసేవిధంగా కృషి చేయాలన్నారు. మల్కాజిగిరి, అల్వాల్ ప్రజలు రైల్వే చక్రబంధం నుంచి విముక్తి పొందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల అంజయ్య, శంకర్, సంపత్, మహేందర్, వెంకటస్వామి, అనంత్, వసుంధర, అమృత, రమాదేవి, జనార్ధన్ తదితరలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్న ఉప్పల్ బీఆర్ఎస్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్ పాషా

రాగిడికి మద్దతుగా ప్రచారం

రామంతాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం సాయి కృష్ణ కాలనీ, సాయి వెంకట్ కాలనీ, కేసీఆర్‌నగర్‌లలో నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచార పాదయాత్రలో బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్ పాషా పాల్గొని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కారు గుర్తుపై ఓటును వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మధుసూధన్‌రెడ్డి, సంపత్‌రావు, కొప్పునర్సింగ్‌రావు, చాంద్‌పాషా, జహంగీర్, శ్రీకాంత్‌గౌడ్, డాన్ శ్రీను, సంధ్య, జానకి, స్వప్న, రాధమ్మ పాల్గొన్నారు.

ధర్మం, న్యాయం కోసం బీజేపీని గెలిపించండి

● మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్

రామంతాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ధర్మం, న్యాయం కోసం బీజేపీని గెలిపించాలని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గురువారం రాత్రి రామంతాపూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొని ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అంతా భోగస్ అని, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓటు వేస్తే మురిగిపోతాయని ఆయన అన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే మల్కాజిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్ అనే నినాదంతో ప్రజలు కమలం గుర్తుపై ఓటును వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ రోడ్ షోలో మాజీ మంత్రి కృష్ణ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్, సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకట్‌రావు, చేతన హరీష్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, నాయకులు బాల చందర్, గడ్డం సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం

అల్వాల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకపోతుందని ఈటల అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన అల్వాల్ సర్కిల్ పరిధిలో ఇందిరానగర్, అంబేద్కర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీగా తనకు అవకాశం కల్పించాలని ఆయన ప్రజలను కోరారు. డివిజన్ అధ్యక్షుడు అంథోని రవికిరణ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దళితమోర్చ అధ్యక్షుడు మురళీకృష్ణా, జిల్లా కన్వీనర్ సుజాత రజినీకాంత్ పాల్గొన్నారు.



రోడ్ షో లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మచ్చబొల్లారం, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల కష్టాసుఖాలు తెలిసిన వాడిగా మీ ముందుకు వస్తున్నా.. ఆశీర్వదించి గెలిపించండి.. మీకు నిరంతరం సేవ చేసేందుకు కంకణబద్ధుడనై ఉంటానని మల్కాజిగిరి బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ఈటెల రాజేందర్ ప్రజలను అభ్యర్థించారు. మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్ హరిజన బస్తీ, మల్లారెడ్డి నగర్‌లో గురువారం డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాణిక్యరెడ్డి, అజయ్‌రెడ్డి, వినయ్, పద్మిని, గోపి తదితరులు పాల్గొన్నారు.

బంజారాలకు అండగా బీజేపీ

కుషాయిగూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బంజారాలకు అండగా ఉందని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గురువారం చర్లపల్లి సిరి గార్డెన్స్‌లో జరిగిన బంజారా ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. గత మంత్రివర్గంలో 12మంది గిరిజనులకు స్థానం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈనెల 13న జరిగే ఓటింగ్‌లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన బంజారాలను కోరారు. రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి సేనావత్ రవి నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి, బంజారా నాయకులు బిక్కు నాయక్, ఇస్లావత్ హరినాయక్, బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, సురేందర్ గౌడ్, గణేష్ ముదిరాజ్, డి.నాదం, లక్ష్మణ్‌గౌడ్, సిహెచ్.మల్లేష్ వంశరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఈటల రాజేందర్

కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

● మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బోయినపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని.. నివేదితకు భారీ మెజారిటీ వస్తుందని, కాంగ్రెస్, బీజేపీలకు స్థానం లేదని, రోజుకో పార్టీ పూటకో కండువా మార్చే నాయకులను పట్టించుకోవద్దని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మల్కాజిగిరి ఎంపీ స్థానం బీఆర్ఎస్‌దేనని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిల గెలుపుకోసం గురువారం కంటోన్మెంట్ పరిధిలోని బోయినపల్లి సౌజన్యకాలనీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని నేతలకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపు ఈపాటికే ఖాయమైందని తలసాని స్పష్టం చేశారు. నివేదితకు 25 వేల నుండి 35 వేల ఓట్ల మెజారిటీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌తో దివంగత ఎమ్మెల్యే సాయన్నకు 35 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. కంటోన్మెంట్ ప్రజలంతా సాయన్న కుటుంబ సభ్యులేనన్నారు. సాయన్న బిడ్డగా నివేదితకు ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నారని, ప్రచారంలో అద్భుత స్పందన వస్తోందని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, అనిత ప్రభాకర్, నళిని కిరణ్, భాగ్యశ్రీ, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, సీనియర్ నాయకులు హరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నివేదిత, రాగిడి లక్ష్మారెడ్డి

ఒక్క చాన్స్ ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా: శ్రీగణేష్



ఎన్నికల ప్రచారంలో భాగంగా కొబ్బరి బొండా కొడుతున్న శ్రీగణేష్



నెహ్రూ సెంటినరీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీగణేష్, తదితరులు

సికింద్రాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో కాలు మోపేందుకు ఒక్క చాన్స్ ఇస్తే కంటోన్మెంట్ రూపురేఖలు మారుస్తానని సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ 7వ వార్డులోని నెహ్రూ సెంటినరీ కాలనీ తదితర బస్తీల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి, తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పదిహేను సంవత్సరాలకుపైగా తాను చేస్తున్న సేవలను గుర్తించాలని, ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. తేజ్‌పాల్, నాగబోని సరిత తదితర నాయకులు పాల్గొన్నారు. కాగా బోయినపల్లిలో ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీగణేష్‌కు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలకు మధుకర్ విజ్ఞప్తి చేశారు.



ప్రయాణికులకు మంచినీళ్లు అందిస్తున్న బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా

రైల్వే స్టేషన్‌లో చలివేంద్రం ఏర్పాటు

● ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా

అడ్డగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు రైల్వే స్టేషన్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని బేగంపేట్ రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మతి బెనర్జీ ఆదేశాల మేరకు బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైలు దిగిన ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు తాగునీరు స్వయంగా అందిస్తున్నామన్నారు. చల్లని నీరు ప్రయాణికులకు అందించి ఆర్పీఎఫ్ పోలీసులు సేవ చేస్తున్నారని తెలిపారు.

పదవ తరగతి ఫలితాలలో

సీఎంఆర్ స్కూల్ విద్యార్థుల విజయఢంకా

బోయినపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడ ఏ విద్యా సంస్థకు కూడా సాధ్యంకాని కేజీ టు పీజీ నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగడానికి తీర్చిదిద్దుతున్న ఏకైక విద్యాసంస్థ సీఎంఆర్ విద్యాసంస్థలు అని తెలంగాణ మాజీ కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో బోయినపల్లి సీఎంఆర్ హైస్కూల్ పాఠశాల వందశాతం ఉత్తీర్ణతతో విజయఢంకా మోగించింది. వీరిలో అశ్రిత, ప్రణవి, లిఖిష, అలైన తస్లిమా, అక్షర, ప్రద్యుమ్న, రాంపా, శివరాం 10/10 జీపీఏ సాధించి బోయినపల్లిలో ప్రభంజనం సృష్టించారు. 60 శాతం మంది విద్యార్థులు ఎ-గ్రేడ్ మార్కులతో ఉత్తీర్ణత సాధించి బోయినపల్లిలో చరిత్ర సృష్టించి బోయినపల్లి ప్రాంతంలో టాప్‌లో నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం మాజీమంత్రి మల్లారెడ్డి తన నివాసంలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందించి వారి తల్లితండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మట్లాడుతూ బోయినపల్లి సీఎంఆర్ హైస్కూల్ 25 సంవత్సరాల నుంచి ఇదేవిధంగా అత్యున్నత స్థాయి ఫలితాలను సాధిస్తుందని అన్నారు. సీఎంఆర్ స్కూల్‌లో విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడారంగాలలో సైతం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ విద్యార్థులను అన్నిరంగాలలో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఒకే ప్రాంతంలో కేజీ టు పీజీ విద్యను అందిస్తున్న విద్యాసంస్థలలో విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులకు సీఎంఆర్ పాఠశాల బోయినపల్లి ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. విద్యాసంస్థలు ఎదగడానికి విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లితండ్రుల సహకారంతో ఈ విజయాన్ని సాధించగలిగారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్‌కె రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లితండ్రులు పాల్గొన్నారు.



పదవ తరగతి ఫలితాలలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మాజీమంత్రి మల్లారెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఎస్‌కె రెడ్డి



నగదు చూపిస్తున్న రైల్వే డీఎస్పీ జావీద్, నాంపల్లి జీఆర్‌పీ సీఐ ప్రవీణ్ కుమార్

సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు

రూ.11.30 లక్షలు స్వాధీనం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులకు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి నుంచి రూ 2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరికి ప్రాంతానికి చెందిన సీతారామారావు బ్యాటరీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో కూర్చున్న ఇతడి బ్యాగును తనిఖీ చేసిన రైల్వే పోలీసులకు రూ.2.30 లక్షల నగదును గుర్తించారు. నగదు గురించి పొంతనలేని సమాధానాలు చెప్పడంతో రైల్వే అధికారులు డబ్బును సీజ్ చేశారు. నాంపల్లి జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నాంపల్లి రైల్వే స్టేషన్‌లో గురువారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో చెన్నై ఎక్స్‌ప్రెస్ నుంచి రైలు దిగిన బాపట్ల పాపయ్య పాలెం గ్రామానికి చెందిన బాలకృష్ణ, వద్ద రూ. 9 లక్షలు కనిపించాయి.. ఈ డబ్బు విషయంపై ఎటువంటి ఆధారాలు చూపెట్టకపోవడంతో నగదును సీజ్ చేసి రిటర్నింగ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

వారాసిగూడ పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

బౌద్ధనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వారాసిగూడ పోలీసులు గురువారం సాయంత్రం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్లు సైదులు (వారాసిగూడ), అనుదీప్(చిలకలగూడ)ల పర్యవేక్షణలో పార్శిగుట్ట క్రాస్‌రోడ్, గంగపుత్రకాలనీ, అశోక్‌నగర్, వైఎస్సార్ పార్క్, రాంనగర్ మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఎస్సైలు, సీఐఎస్ఎఫ్ సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అడ్మిన్ ఎస్సై సుధాకర్, ఎస్సైలు ప్రకాశ్‌రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.



రాంనగర్‌లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న వారాసిగూడ పోలీసులు

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రైలులో పోగొట్టుకున్న బంగారు గొలుసును ఆర్పీఎఫ్ పోలీసులు వెతికి పట్టి ప్రయాణికురాలికి అప్పగించారు. సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రయణికురాలు గురువారం కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్‌కు వస్తుండగా లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు దిగగానే మెడలోఉన్న 13 గ్రాముల బంగారు గొలుసు కనిపించకపోవడంతో రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్సై వి.భాషా, రాదేశ్‌లకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. రైలు కదిలే క్రమంలో అప్రమత్తమైన ఆర్పీఎఫ్ అధికారులు ఆమె ప్రయాణించిన బోగీలో వెతక బెర్తు కింద పడి పోయి ఉందని గమనించిన ఆర్పీఎఫ్ పోలీసులు గొలుసును భద్రంగా బాధిరాలికి అప్పగించారు. రైలులో ప్రయాణం చేసేమయంలో నగలతో ప్రయాణం చేయవద్దని తమ లగేజీలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సీఐ కల్పన ప్రయాణికులకు సూచించారు.



రైలులో పోగొట్టుకున్న గొలుసును ప్రయాణికురాలికి అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు